ఆశౌచ నిర్ణయము

కీ.శే. భారతం వేదమూర్తిశాస్త్రులుగారి

అప్పాల వేంకటేశ్వరశాస్త్రిచే

సంగ్రహితము

ఆశౌచ నిర్ణయము

కీ॥శే॥ భారతుల శేషావధాన్యంతేవాసి

అవ్వారి వేంకటేశ్వరశర్మచే

సంగ్రథితము

విషయాను క్రమణిక

1. జాతాశౌచ విషయః - ప్రసూతౌ స్రావాశౌచ విషయః
2. పాతాశౌచము
3. సాపిండ్యాది లక్షణము
4. వర్ణానాం ఆశౌచభేదమాహ
5. దశాహాభ్యన్తరే శిశుమరణాది నిర్ణయః
6. దశాహోపరి శిశుమరణే
7. కన్యామరణాశౌచము
8. ఆత్మబంధువులు
9. స్వగృహే పుత్ర్యాః ప్రసవే
10. పక్షిణ్యాది లక్షణము
11. అసగోత్ర మృతాశౌచము
12. అతిక్రాన్తాశౌచము
13. దేశభేద నిర్ణయః
14. ఆశౌచ సంపాత విషయః
15. గ్రామాశౌచ నిర్ణయః
16. ద్రవ్యాశౌచ నిర్ణయః
17. ఆశౌచినాం సంధ్యావందనాది విషయః

18. సంధ్యావందనాభావే ప్రత్యవాయమానం

19. ఆశౌచాపవాద నిర్ణయము

20. ఆశౌచ నియమములు

21. ఆశౌచన్తమందు చేయదగిన విధి

22. గురుపాదాభివన్దనమ్

23. శాంతి మంగళ పఠనము

24. గుణదోష వివేకార్ధము

విన్నపము

పురాణములు, స్మృతులు, నిబంధన గ్రంథములు మున్నగునవి ఆశౌచమునగూర్చి అధికముగా వివరించినవి. శ్రుతి స్మృతి పురాణముల నట నట విప్రకీర్ణములైయున్నవిషయములను నిర్ణయసింధువు, అభినవషడశీతి మున్నగు గ్రంథములు ఒకచోటచేర్చి వానికి అనుక్రమమును కల్పించినవి. ఆ గ్రంథములందు వివరముగ నున్నవానిని ధర్మసింధువు సంగ్రహించినది. ప్రస్తుత గ్రంథము ఈనాటి పాఠకులకు సుబోధమగుటకై పూర్వగ్రంథములలోనున్న విషయముల సారసంగ్రహముగా గ్రంథింపబడినది.

గుంటూరు మండలములో పిచ్చయ్యగారను నామాంతరముగల మా పెద్దతాతగారు అగు అవ్వారి పురుషోత్తముగారు ఆకాలమున సంకల్పధికారి అనుపేరు వడసినవారు. వారి సోదరుడగు రామయ్యగారి కుమారులగు మా నాయనగారు కీ॥శే॥ అవ్వారి వేంకటభట్టుగారు, గుంటూరు మండలములో జ్యోతిష వాస్తు ధర్మశాస్త్రములయందేగాక షోడశకర్మలు ధర్మశాస్త్రయుక్తముగ చేయించుటయం దనర్గళ ప్రతిభావంతు లని అఖండయశస్సు (పేరుప్రతిష్ఠలు) నముపార్జించినవారు. కాని కాలవశమున వారు ది.10-3-1945నాడు 60 సంవత్సరముల ప్రాయమున అకాలమృత్యువు వాతఁబడిరి. నాకు విద్యను ప్రసాదించిన మధురకంఠ స్వరాధ్యేత బిరుదాంకితులు జ్యోతిష ధర్మశాస్త్ర వాస్తు జాతకభాగముల యందు ప్రతిభావంతులు కీ॥శే॥ భారతుల శేసావధానులుగారు మా గురువర్యులు. వారి అనుగ్రహమున నా కృషి ఫలమగు ఈ ఆశౌచనిర్ణయమను గ్రంథమును మా పితృదేవుల, గురుదేవుల

జ్ఞాపకార్థముగా ముద్రించు ప్రయత్నమున నున్న నాకు మా పెదతాతగారి మునిమనుమడు, శ్రీశారదానుగ్రహపాత్రుడు, సత్ప్రవర్తనుడు పెద్దలమన్ననలకు పాత్రుడు మా మాటలయందు గౌరవాభి మానములుగల మా చిరంజీవి అవ్వారి నరసింహమూర్తి; మా జ్యేష్ఠ సోదరీభావుకులు సీతారామమ్మ పున్నయ్యశాస్త్రి దంపతుల కుమారుఁడు మా మేనల్లుడు చి॥ బొడ్డుపల్లి చిదంబరశాస్త్రి అనువారల విశేష ప్రోత్సాహముతో దీనిని ముద్రింపఁజేయుచున్నాను. ఈ చిరంజీవులకు శుభాశీస్సుల నందించుచున్నాను.

విజ్ఞులు వీనిలోని అంశములను జదువుకొని ఆచరించుచు వారి సందేహములను నివారించుకొనుచు ఉపయోగించుకొందురుగాత. లోపములున్న 'గుణదోషా' అనున్యాయమున మన్నింప వేడుదును.

శ్లో॥ "సూతకం జననాశౌచం మరణాశౌచ మి త్యపి"

సూత మనగా సూతకము (ఆశౌచము). అది జాతాశౌచమని మృతాశౌచ మని రెండు విధములు. అనగా జననాదులవలన కలుగు అపవిత్రత అని అర్థము. దానిశుద్ధి ఈ గ్రంథములో వివరింపబడినది. అనేకసంశయముల నిది నివారించును. దీనిని నిర్మించుటకు శక్తి నొసగిన పితరుల, అస్మద్గురువర్యుల చరణకమలములకు నమస్కారము లర్పించుచున్నాను.

ఈ గ్రంథముద్రణమున తీరికచేసికొని ప్రూఫులు దిద్ది నాకు సాయమొనర్చిన చిరంజీవి జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి గారిని ఆశీర్వదించుచున్నాను.

ఇట్లు

అవ్వారి వేంకటేశ్వరశర్మ

ఆశౌచ నిర్ణయము

జాతాశౌచ విషయః

ప్రసూతౌస్రావాశౌచ విషయః

శ్లో॥ శ్రీకృష్ణం రుక్మిణీశం చ పితరౌ దీనవత్సలౌ
ధ్యా త్వేష్ట సిద్ధయేనత్వా వక్ష్యే ఉధాశౌచనిర్ణయమ్ ॥

ధర్మప్రవృత్తౌ ॥

శ్లో॥ జాతకం మృతకం చేతి ద్వివిధం సూతకం స్మృతమ్ ।
స్రావః పాతః ప్రసూతి శ్చ త్రైవిధ్యం జాతకస్య తు ॥ 1

తా॥ జాతమనియు, మృతమనియు ఆశౌచము రెండు విధములు. జాతాశౌచము స్రావమనియు, పాత మనియు, ప్రసూతి యనియు మూడు విధములై యున్నది.

అత్ర వ్యవస్థాన్తర మాహ ॥

శ్లో॥ ఆచతుర్థా ద్భవే త్స్రావః పాతః పంచమషష్ఠయోః ।
అత ఊర్ధ్వం ప్రసూతి స్స్యాద్దశాహం సైతకం భవేత్ ॥

తా॥ గర్భధారణ మాసము మొదలుగ నాలుగు మాసముల లోపల గర్భము చెడిపోయెనేని, అది స్రావమనియు, అయిదు, ఆరు మాసములయందు చెడిపోయెనేని అది పాతమనియు, ఏడవమాసము మొదలుగ ప్రసూతియని తెలియదగినది.

శ్లో॥ త్రిషు మాసేషు గర్భస్య స్రావే మాతు స్త్రిరాత్రకమ్ ।
చతుర్థే తు చతూరాత్రం మునిభి స్సముదీరితమ్ ॥ 3

తా॥ అనగా మూడవమాసమునందు స్రావమగునేని బాలింతకు మూడు దినములు జాతాశౌచము. నాల్గవమాసమునందు స్రావమగునేని బాలింతకు నాల్గు దినములు జాతాశౌచము.

శ్లో॥ స్రావే చైవ పితుః స్నానం సపిండానాం న విద్యతే ।

తా॥ అనగా మూడు నాల్గు మాసములనందు సంభవించిన స్రావమునందు తండ్రికి, సోదర భ్రాతలకు అనగా గృహమందు ఉన్న కుటుంబమునకు స్నానమాత్రముచే శుద్ధి యగును. తదితర జ్ఞాతులకు స్నానముతో కూడ నిమిత్తము లేదని చెప్పవలయును.

సూత్ర॥ కఠిన స్రావే పితుః త్రిరాత్రజాతా శౌచమ్ ॥

తా॥ అనగా కఠినస్రావమందు తండ్రికి మూడు రాత్రములు జాతాశౌచ మని చెప్పవలయును.

పాతాశౌచము :

శ్లో॥ షష్ఠ పంచమయో ర్మాతు ర్మాసతుల్యాఘ మిష్యతే ।
జనకస్య సపిండానాం త్రిరాత్ర మఘ మిష్యతే ॥ 5

తా॥ అయిదవమాసమునందు గలుగు గర్భపాతమువలన తల్లికి అయిదుదినములు జాతాశౌచము. ఆరవ మాసమునందు గలుగు గర్భపాతమువలన తల్లికి ఆరుదినములు జాతాశౌచము. తండ్రి మొదలుగ జ్ఞాతులందరికి ఈపాతమందు మూడు దినములు జాతాశౌచము.

సాపిండ్యాదిలక్షణమ్ :

శ్లో॥ అసప్తమా త్సపిండాః స్యు స్తదూర్ధ్వం సప్తపూరుషాః ।
సోదకా స్తత ఊర్ధ్వస్తు గోత్రజాః పరికీర్తితాః ॥ 6

తా॥ తాను మొదలుకొని ఏడుగురుపురుషుల పర్యన్తము సపిండు లనియు, ఆపైన ఏడుగురివరకు సమానోదకు లనియు, అటుపైన ఏడుగురి వరకు సగోత్రులనియు చెప్పబడుదురు.

శ్లో॥ ఆసప్తమా త్సపిండా స్తు సోదకా శ్చ చతుర్దశ ।
సగోత్ర ఏకవింశ స్తు దశాహం త్రిదినం దినమ్ ॥ 7

తా॥ తాను మొదలుగ ఏడు పురుషాంతరములవరకు సపిండులు. వీరలకు జాతాశౌచము గాని మృతాశౌచము గాని పదిరోజులు పట్టవలయును. అటుపైన ఏడుగురు వరకు సమానోదకులు. వీరలకు జాతాశౌచము గాని, మృతాశౌచము గాని, మూడురోజులు పట్టవలయును. ఆపైన ఏడుగురువరకు సగోత్రులనబడుదురు. వీరలకు జాతాశౌచము గాని, మృతాశౌచము గాని ఒక్కరోజు పట్టవలయును.

వర్ణానాం ఆశౌచ భేద మాహ

శ్లో॥ దశాహా చ్ఛుధ్యతే విప్రః ద్వాదశాహేన భూమిపః ।
వైశ్యః పంచదశాహేన శూద్రో మాసేన శుధ్యతి ॥ 8

తా॥ బ్రాహ్మణులకు పదిరోజులు మృతాశౌచము. క్షత్రియులకు పన్నెండు రోజులు మృతాశౌచము. వైశ్యులకు పదిహేనురోజులు మృతాశౌచము. శూద్రులకు ముప్పదిరోజులు మృతాశౌచము నుండును.

శ్లో॥ జాతాశౌచం మృతాశౌచం దశరాత్రేణ శుధ్యతః ।
ఋణగ్రస్తే సదా శౌచం హవ్యకవ్యవివర్జితః ॥ 9

తా॥ జాతాశౌచమును, మృతాశౌచమును పదిరోజులతో శుద్ధియగును. అప్పుతీర్చనివానికి ఎల్లప్పుడును ఆశౌచము కలదు. ఆశౌచమం దున్నవాడు హవ్యకవ్యములయందు విడిచిపెట్టదగినవాడు.

"జాతకే మృతకే చైవ వపనం దశమేఽహని" 10

తా॥ జాతాశౌచ మృతాశౌచములందు పదియవరోజు క్షురకర్మ విధియై యున్నది. (మంచి చెడులు యోచింప పనిలేదు)

ఇక జాతాశౌచమందైనచో -

శ్లో॥ సూతికా స్సర్వవర్ణానాం దశరాత్రేణ శుధ్యతి ।
ఋతౌచ నపృథ క్ఛుద్ధిః సర్వవర్ణేష్వయం విధిః ॥ 11

శ్లో॥ అజా గావో మహిష్య శ్చ బ్రాహ్మణాది ప్రసూతికాః ।
దశరాత్రేణ శుధ్యన్తి భూమిష్ఠం తు నవోదకమ్ ॥ 12

తా॥ బ్రాహ్మణాది నాలుగు వర్ణములయందు స్త్రీలు ప్రసవించినప్పుడు పదిరోజులు జాతాశౌచము. ఇటువలెనే మేకలు, గొఱ్ఱెలు, ఆవులు, గేదెలు ఈనినప్పుడు గూడ పదిరోజులు పురుడని చెప్పబడును. అందుకనియే పదిరోజులు లోగా ఆవుపాలు త్రాగుట గాని, కవ్వముచే చిలుకుట గాని చేయరు. ఇంతియే గాక ప్రథమ రజస్వల అయిన స్త్రీకి గూడ పదిరోజులు రజస్వలాశౌచము కలదు. క్రొత్తగా తొలకరి వానలవలన భూమిమీద నిలిచియున్న నీటిని కూడ పదిరోజుల వరకు త్రాగకూడదు. అనగా ఉదకమునకు కూడ పురుడు కలదని భావము.

– దశాహాభ్యన్తరే శిశుమరణాశౌచనిర్ణయః –

శ్లో॥ నాభికృన్తనతః పూర్వం శిశౌ ప్రేతే తు సూతకమ్ ।
మాతుః పూర్ణ మతో ఽన్యేషాం పితు శ్చత్రిదినం సమమ్॥ 13

తా॥ ఏడవ మాసము మొదలుకొని ప్రసవించినప్పుడు బొడ్డు కోయుటకు ముందు శిశువు మృతినొందిన యెడల తల్లి పదిరోజులు జాతాశౌచము పట్టవలయును. తండ్రియు, జ్ఞాతులును మూడురోజులు జాతాశౌచమును పట్టవలయును. మృతాశౌచము సచేలస్నానముతోనే నివర్తించును.

శ్లో॥ మృతస్య ప్రసవే చైవ నాభిచ్ఛేదా త్పరం మృతౌ ।
మాతాపిత్రో స్సపిండానాం దశాహం తత్ర సూతకమ్ ॥ 14

తా॥ చచ్చిన బిడ్డ పుట్టినను, బొడ్డుకోసిన తరువాత బిడ్డ చచ్చినను, తల్లిదండ్రులు, దశరాత్రజ్ఞాతులు పదిరోజులు జాతాశౌచము పట్టవలెను.

శ్లో॥ అత్ర సూతక మేవ స్యా దఘం శావం న విద్యతే ।
శావాశౌచం తదా తేషాం స్నానమాత్రా ద్విశుధ్యతి ॥ 15

తా॥ ఈ విషయమందు జాతాశౌచవే ముఖ్యముగాని శావాశౌచము స్నానముతోనే నివర్తించును. (శావాశౌచమునకు స్నానముచేసి జాతము పట్టవలయును.)

శ్లో॥ సూతక స్యాన్తిమదినే శిశౌ ప్రేతే తు సూతకమ్ ।
ద్వాభ్యాం శుద్ధి శ్చ తత్పిత్రోః ప్రభాతే త్ర్యహ మీరితమ్ ॥16

తా॥ పదియవనాడు శిశువు చనిపోయిన యెడల పిమ్మట రెండు రోజులు తల్లిదండ్రులకు మృతాశౌచ మనియు పదియవరోజు రాత్రి

నాల్గవజామునందు చనిపోయినయెడల పిమ్మట మూడురోజులు మృతాశౌచ మనియు తెలియవలెను.

అత్ర విశేష మాహ ॥

శ్లో॥ మరణం దశమే రాత్రౌ వహ రి త్యేక ఊచిరే ।
సర్వే సపిండా శ్శుధ్యన్తి తచ్ఛేషే నైవనాన్యథా ॥ 17

తా॥ పదయవనాటిపగటియందు బిడ్డ చనిపోయినయెడల తల్లిదండ్రులకు పూర్వమవలంబించియున్న జాతాశౌచముచేతనే శుద్ధి యనియు, పదియవనాటిరాత్రియం దైన పిమ్మట రెండు దినములు మృతాశౌచ మనియు, పదివయనాటి నాల్గవజామున శిశుమరణ మైన యెడల పిమ్మట మూడురోజులు మృతాశౌచ మనియు కొందరు చెప్పుచున్నారు. ఎట్లైనను జ్ఞాతు అందరు పూర్వ మవలంబించి యున్న జాతాశౌచముచేతనే పరిశుద్ధు లగుదురు. ఈవిషయములో రెండవ మతమే యుక్తముగా నున్నది.

శ్లో॥ ఉదక్యాయాః పతిం యావ త్సూతికాయాః పతిం తథా ।
భాండస్పర్శనపర్యన్తం పైతృకాదిషు వర్జయేత్
స్వేన కర్తవ్యకర్మాణి కుర్యా దేవావిచారయన్ ॥ 18

తా॥ బహిష్ఠ అయిన దానిభర్తయు ప్రసవించిన దానిభర్తయు కుండ మొదలుగా గల వస్తువులను భార్యకు స్పృశించగల యోగ్యత వచ్చువరకు వారు పితరులకర్మలకు ఉపయోగించరు గాని స్వకర్తవ్యముచే నాచరించదగిన కర్మలు విచారింపకయే చేయదగును.

శ్లో॥ ధర్మాధికారే వింశత్యా స్త్రీప్రసూశ్శుద్ధిరిష్యతే ।
పుత్రసూ ర్మాసతశ్శుద్ధ్యేదితి శాస్త్రవిదాం మతమ్ ॥ 19

తా॥ ఆడపిల్ల పుట్టిన ఇరువది దినములవరకును మగబిడ్డ పిమ్మట ముప్పదిరోజులవరకును బాలింత పరిశుద్ధురాలు కాదు. పిమ్మట పరిశుద్ధురా లగును. ఇదియే పెద్దపురు డని వాడుక. ఈపురుడు వెళ్లువఱకు తల్లిదండ్రులు, దేవకార్యములు చేయగూడదు.

శ్లో॥ సపిండానా మతిక్రాన్తం సూత్యాశౌచం సవిద్యతే ।
పితా శ్రుత్వా పుత్రజన్మ స్నానా ఉచ్ఛుద్ధో భవ త్యలమ్ ॥20

తా॥ సపిండజ్ఞాతులు దశరాత్రజాతాశౌచమును పదిరోజులు గడిచినపిమ్మట వినినను తిరిగి పట్టనక్కరలేదు. తండ్రిమాత్రము పుత్రజననమును వినినతోడనే స్నానము చేసినయెడల పరిశుద్ధుడగును.

– దశాహోపరి శిశుమరణే –

శ్లో॥ దశాహానన్తరం పుత్రే ప్రేతే పిత్రో ర్దినత్రయమ్ ।
భిన్నోదరాణాం భ్రాతౄణాం సోదరాణాం చ జ్ఞాతిషు ॥21

తా॥ పది దినములు వెళ్ళిన పిమ్మట మగశిశువు చనిపోయిన యెడల తల్లిదండ్రులకు మూడురోజులు మృతాశౌచము. భిన్నోదరులైన భ్రాతలకు, సోదరులకు, జ్ఞాతులకు మూడురోజులు ఆశౌచము

అత్ర విశేషః –

శ్లో॥ ఆదన్తజన్మనా త్సద్యః ఆచూడా నైశికీ స్మృతా ।
త్రిరాత్ర మావ్రతా ద్దేశా ద్దశరాత్ర మతః పరమ్ ॥ 22

తా॥ పదిరోజులు వెళ్ళినది మొదలుకొని దంతములు వచ్చు పర్యంతము అనగా ఆరు మాసముల వరకు జ్ఞాతులకు సద్యశ్శౌచము. అనగా పగలు పోయిన యెడల పగలంతయు, రాత్రి చనిపోయిన

యెడల రాత్రియంతయు, సద్యశ్శౌచమనంబడును. కనుక మృతాశౌమును పట్టవలెను. పదిరోజులు పురుడు వెళ్ళిన పిమ్మట ముక్కుగాని, చెవులుగాని కుట్టకుండ మూడు సంవత్సరములు వెళ్ళులోపల శిశువు చనిపోయిన యెడల నైశికి అనగా ఒక పగలు, ఒక రాత్రి లేక ఒక రాత్రియు నొక పగలును అనగా అరువది గడియలు జ్ఞాతులు మృతాశౌచమును పట్టవలయును. అటుపిమ్మట నాల్గవ సంవత్సరము మొదలుకొని ఉపనయన పర్యన్తము ఐతే ఆ తర్వాత పదిరోజులు మూడురోజులు మృతాశౌచము పట్టవలయును.

మూలమ్ - ప్రథమ వర్షాదౌ కృతచూడస్య పుత్రస్య మరణే ।
పిత్రాది సపిండానాం త్రిదిన మాశౌచం నియతమ్ ॥

తా॥ ప్రథమ సంవత్సరము లోపలనే శిశువుకు ముక్కుగాని, చెవులుగాని కుట్టించిన పిమ్మట చనిపోయిన యెడల తండ్రి, తల్లి జ్ఞాతులు మూడు దినములు మృతాశౌచమును పట్టవలయును.

- కన్యామరణాశౌచము -

శంఖకార్ష్ణజినీ॥

సూత్రం - అజాతాదంతాసు పిత్రో రేకరాత్రమితి ॥

తా॥ పదునొకండవదినము మొదలుకొని దంతజననమునకు పూర్వము అనగా ఆరుమాసములకు లోపల పుత్రిక మరణమును పొందెనేని తల్లిదండ్రులు ఒకరోజు మృతాశౌచమును పట్టవలయును. రెండవ మత మె ట్లనిన -

శ్లో॥ దశాహోపరి కన్యాయా మరణం యది సంభవేత్ ।
పిత్రో ర్దినత్రయం ప్రోక్తం జ్ఞాతీనాం స్నాన ముచ్యతే ॥ 23

శ్లో॥ ఆచౌలకరణాత్సద్యః తదూర్ధ్వ మహ రేవ తు ।
చతుర్థవర్ష మారభ్య చౌలాభావే ప్యహ స్సమమ్ ॥ 24

తా॥ పదిరోజులు వెళ్లిన పిమ్మట పుత్రిక మరణమును పొందె నేని తల్లిదండ్రులకు మూడు దినములు ఆశౌచ మనియు, జ్ఞాతుల కైనచో శిశువు ముక్కు, చెవులు కుట్టునంతవరకు పగలు మరణ మైన యెడల పగ లంతయును రాత్రి మరణ మైన ఆరాత్రి అంతయును మృతాశౌచమును పట్టవలయును. నాల్గవ సంవత్సరము మొదలుకొని ముక్కు, చెవులు కుట్టినను లేకున్నను జ్ఞాతులు ఒకరోజు మైల పట్టవలయును. ఈవిషయములో తల్లిదండ్రులకు మొదటి మతమే యుక్తముగా నున్నది.

– ఆత్మాది బంధువులు –

శ్లో॥ ఆత్మపితృష్వసుః పుత్రా ఆత్మ మాతృష్వసు స్సుతాః ।
ఆత్మమాతులపుత్రా శ్చ విజ్ఞేయా ఆత్మబాంధవాః ॥ 25

శ్లో॥ పితుః పితృష్వసుః పుత్రాః ర్మాతృష్వసు స్సుతాః ।
పితు ర్మాతులపుత్రా శ్చ విజ్ఞేయాః పితృబాంధవాః ॥ 26

శ్లో॥ మాతుః పితృష్వసుః పుత్రా మాతు ర్మాతృష్వసు స్సుతాః ।
మాతు ర్మాతులపుత్రా శ్చ విజ్ఞేయా మాతృబాంధవాః ॥

శ్లో॥ మాతుః పితృష్వసుః పుత్రా మాతు ర్మాతృష్వసు స్సుతాః ।
మాతు ర్మాతులపుత్రా శ్చ విజ్ఞేయా మాతృబాంధవాః ।
ఇతి అత్ర మాతృష్వస్రాదీనా మపి బాంధవత్వం విజ్ఞేయమ్॥

తా॥ తన మేనత్త కొడుకు బిడ్డలు, తన పినతల్లి పెదతల్లి బిడ్డలు (కొడుకులు కూతుళ్లు) తన మేనమామ బిడ్డలు, ఆత్మబంధువులని తెలిసికొనవలెను.

తా॥ తండ్రి మేనత్త బిడ్డలు, తండ్రి పినతల్లి పెదతల్లి బిడ్డలు, తండ్రి మేనమామ బిడ్డలు పితృబంధువు లని గ్రహింపవలెను.

తా॥ తల్లి మేనత్త బిడ్డలు, పినతల్లి పెదతల్లి బిడ్డలు, తల్లి మేనమామ బిడ్డలు, మాతృబంధువులని తెలిసి కొనదగియున్నది. ఇచట పినతల్లి పెదతల్లుల బిడ్డలే గాక పినతల్లి, పెదతల్లి, మేనత్త, మేనమామ మొదలగువారు గూడ బంధువు లగుదురని తెలిసికొనవలెను.

- స్వగృహే పుత్ర్యాః ప్రసవేః -

శ్లో॥ యది పుత్ర్యా పితు ర్గేహే పుమాంసం జనయే త్తదా
భిన్నోదరాణాం భ్రాతౄణాం సోదరాణాం తథైవ చ
పిత్రో స్త్రిదిన మాశౌచ కన్యాసూతే తు పక్షిణీ ॥ 28

తా॥ కుమార్తె తండ్రి యింట మగశిశువును కనినయెడల తల్లిదండ్రులకు సోదర భిన్నోదర భ్రాతలకును పెండ్లికాని చెల్లెండ్రకును మూడురోజులు జాతాశౌచ ముండును. ఆడపిల్లను కనినచో పక్షిణీ జాతాశౌచమును పట్టవలయును. అనగా రెండు పగళ్లు ఒకరాత్రి లేక రెండు రాత్రములు ఒక పగలు అనగా మొత్తము తొంబది (90) గడియలని భావము.

శ్లో॥ తత్రాపి ద్రవ్యదానే తు త్రిదినం చైక ఊచిరే ॥ 29

తా॥ కుమార్తె మరియొకరి యింట ప్రసవమైనప్పుడు తాను ద్రవ్యాదులను ఇచ్చిన యెడల మూడురోజులు పురుడని మరికొందరు చెప్పుచున్నారు. ఇతర గ్రామములో ప్రసవించినప్పుడు తాను దగ్గర లేనియెడల పురుడు పట్టనక్కరలేదు.

- పక్షిణ్యాది లక్షణమ్ -

శ్లో॥ ద్వి ర్దివారాత్రి సంయుక్తే పక్షి ణీ త్యభిధీయతే ।
అహోరాత్ర మితి ప్రోక్తం నైశికీ త్యభిధీయతే ।
ఆసాయ మహ రేవ స్యా త్సద్య స్తత్కాల ఉచ్యతే ॥

తా॥ రెండు పగళ్లు ఒకరాత్రి కలిసినచో అనగా (90) తొంబది గడియలు పక్షిణి యనబడును. ఒక పగలు ఒకరాత్రి కలిసినచో అనగా అరువది (60) గడియలు నైశికి యనబడును. ఆశౌచము పగలు తెలిసినచో పగలంతయు, రాత్రి తెలిసినచో రాత్రియంతయు సద్యస్కాల మనియు తత్కాల మనియు చెప్పబడును. ఈసంజ్ఞనే సర్వత్ర వాడవలయును.

- అసగోత్ర మృతాశౌచము -

శ్లో॥ పుత్రీగేహే ఽథ వాన్యత్ర పితరౌ ప్రమృతౌ యది ।
పుత్ర్యా స్త్రిదిన మాశౌచం దశాహాభ్యంతరే భవేత్ ॥

అత్ర విశేష మాహ -

శ్లో॥ ద్వితీయే చ తృతీయే చ నవమీ దశమీ తథా ।
శ్శుద్ధి స్స్యా చ్ఛేషతః పుత్ర్యా ఇతరేషు త్రిరాత్రకమ్ ॥

తా॥ కుమార్తె యింటగాని ఇతరత్ర గాని తల్లిదండ్రులు మృతులైన యెడల కుమార్తెకు పదిరోజులలో నెప్పుడు తెలిసినను ఆమె మూడురోజులు మృతాశౌచమును బట్టవలయును. ఎట్లనగా రెండవరోజున మూడవరోజున తెలిసిన యెడల నాల్గవరోజున స్నానము చేయవలయును. తొమ్మిదవ రోజునగాని పదియవ రోజునగాని తెలిసిన యెడల పదకొండవ రోజున స్నానమును చేయవలయును. అట్లుగాక

నాల్గు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది రోజులలో తెలిసిన యెడల కుమార్తె మూడురోజులు మృతాశౌచమును పట్టవలయునని భావము.

శ్లో॥ దౌహిత్రే భగనీసుతే వ్రతమృతే జామాతపుత్రో ర్మృతౌ ।
స్యా న్మాతామహయో రథ శ్వశురయో శ్శిష్యే స్వబంధౌ గురౌ।
మాతుల్యాం భగినీత్రయే స్వజననిభ్రాత ర్యశౌచే త్ర్యహం ।
పక్షిణ్యే ష్వసమీపగేషు తదతిక్రాన్తే శుచిః స్నానతః ॥

తా॥ ఉపనయనమైన దౌహిత్రుడు, మేనల్లుడు, అలుడు, కుమార్తె, మాతామహ, మాతుః పితామహీలు, పిల్లను ఇచ్చిన అత్తమామలు, సాంగముగా నొకవిద్యను తనదగ్గర చదువుకొన్న శిష్యుడు, మేనత్త కుమారుడు, మేనమామ కుమారుడు, పినతల్లి పెదతల్లుల కుమారులు, ఒక విద్యను సాంగముగా చెప్పిన గురువు, మేనమామ భార్య (పురుష పర్యాయములో) తోబుట్టువు, మేనత్త, పినతల్లి పెదతల్లులు, మేనమామ, వీరలు సన్నిధానమందు చనిపోయినయెడల త్రిరాత్రమృతాశౌచమును పట్టవలయును. అసన్నిధానమందు అనగా ఇతరగ్రామములో తాను దగ్గర లేనిసమయమున చనిపోయినప్పుడు పక్షిణ్యాశౌచమును పట్టవనయును. ఆపక్షిణీకాల మతిక్రమించిన పిమ్మట విన్నయెడల స్నానముతోనే శుద్ధి యగును.

(పై అంశమునే సౌలభ్యము కొరకు కిచట వ్రాయడ మైనది).

1. మేనల్లుడు
2. అల్లుడు
3. కుమార్తె
4. తాత (మాతామహ)
5. అమ్మమ్మ (మాతామహి)
6. పిల్లనిచ్చిన అత్తమామలు
7. శిష్యుడు
8. మేనత్త కుమారుడు

9. మేనమామ కుమారుడు
10. పినతల్లి (కుమారులు)
11. పెదతల్లులు (కుమారులు)
12. గురువు
13. మేనమామ భార్య
14. తోబుట్టువు
15. మేనత్త
16. పినతల్లి
17. పెదతల్లి
18. మేనమామ
19. దౌహిత్రుడు = కూతురు కుమారుడు, ఉపనయన మయినవాడు.

వీరలు సన్నిధానమందు 3 రోజులు దగ్గర లేనపుడు ఒకటిన్నర రోజు అశౌచము.

శ్లో॥ త్రిదినాశౌచ మ త్రోక్తం పక్షిణ్యాశౌచ మేవ వా।
పుత్రాదినాకృతే పైతృమేధ ఏవ భవ త్యలమ్ ।
స్వకర్తృకే పితృమేధే దశరాత్ర మఘం భవేత్ ॥ 34

తా॥ మాతామహాదులమరణమును గురించి చెప్పబడిన త్రిరాత్రాశౌచము గాని పక్షిణ్యాశౌచము గాని తత్పుత్రాదు లుండి ఉత్తరక్రియలు చేసిన విషయమని తెలియవలయును. లేక తానే ఉత్తర క్రియలు చేయవలసినయెడల పదిరోజులు మైల పట్టవలయును.

శ్లో॥ పిత్రో ర్బంధుషు చానపత్యతనయా నాశా త్పరం పక్షిణీ ।
జామాతు శ్చ పరస్పరం శ్వశురయో రేవం హి చౌలా త్పరం॥
స్వస్త్రీయస్య సుతాసు తస్య చ మృతావా మౌంజి బన్ధా త్తథా ।
దౌహిత్ర్యుద్భవ ఏవ జాత మపి వా స్యా త్పక్షిణీ సంజ్ఞకమ్॥35

తా॥ 1. తండ్రియొక్క మేనత్త మేనమామ కుమారులు, 2. తండ్రియొక్క పినతల్లి పెదతల్లుల కుమారులు, 3. తల్లియొక్క మేనత్త

మేనమామల కుమారులు, 4. తల్లియొక్క పినతల్లి పెదతల్లుల కుమారులు, చనిపోయినప్పుడును సంతానము లేకుండ భార్య చనిపోయిన పిమ్మట అత్తమామలు చనిపోయినప్పుడును సంతానము లేకుండా కుమార్తె చనిపోయిన పిమ్మట అల్లుడు చనిపోయినప్పుడును మూడు సంవత్సరములు దాటిన పిమ్మట గాని లేక ఈలోపుగా ముక్కు చెవులు కుట్టిన పిమ్మటగాని, దౌహిత్రుడు మేనల్లుడు చనిపోయినప్పుడు సన్నిధానమునందు పక్షిణీ మృతాశౌచమును పట్టవలయును. అసన్నిధానమునందు స్నానముచే శుద్ధి యగును. ఇంతియేగాక తనయింట కుమార్తె ఆడపిల్లను కనినయెడల శిశువుయొక్క మాతామహులు, మేనమామలు పక్షిణీజాతాశౌచమును పట్టవలయును.

శ్లో॥ మాతామహీ మాతులానీ మాతులానాం మృతౌ స్త్రియః ।
పక్షిణీ పురుషాణా న్తు త్రిరాత్ర మఘ మిష్యతే ॥ 36

తా॥ మాతామహీమాతామహులు, మేనమామ, మేనమామ భార్య వీరలు చనిపోయినప్పుడు వివాహిత స్త్రీలు పక్షిణ్యాశౌచమును, పురుషులు త్రిరాత్రశౌచమును అవలంబించవలయును. వివాహమైన పిమ్మట అప్పచెల్లెళ్లు ఒకరికినొకరు ఆశౌచమును బట్టుట ఆంధ్రాచారము కాదు.

శ్లో॥ పితృష్వసుః పతి ర్మాతృష్వసు ర్భర్తా మృతో యది ।
దశాహాభ్యన్తరే స్నానా చ్ఛుద్ధి రూర్ధ్వం న కించన ॥

తా॥ మేనత్త పెనిమిటి, పినతల్లి పెదతల్లుల భర్తలు చనిపోయినపుడు పదిరోజులలోగా నెప్పుడు విన్నను, సన్నిధానమందున్నను, స్నానముతోనే శుద్ధి యగును. త్రిరాత్రము గాని పక్షిణి గాని ఆశౌచము పట్టనక్కరలేదు.

శ్లో॥ శ్వశురస్య సుతే ప్రేతే త్వహోరాత్రేణ శుధ్యతి ।
స్యాలకే తత్సుతే చైవ సద్యః స్నానేన శుధ్యతి ॥ 38

తా॥ భార్య తోబుట్టువు అనగా బావమరది ఉపనయనమై సన్నిధానమందు చనిపోయినప్పుడు ఒక పగలు ఒకరాత్రి ఆశౌచమును పట్టవలయును. బావమరది కొడుకు ఉపనయనమై చనిపోయిన యెడల స్నానముతోనే శుద్ధియగును.

శ్లో॥ భగినీనిలయే భ్రాతా మృత శ్చే స్మృతకం తథా ।
భగిన్యా స్త్రిదినం ప్రోక్తం న తు స్యా ద్భగినీపతేః ॥ 39

శ్లో॥ ఏవం భ్రాతృగృహే యత్ర భగినీ చే ద్విపద్యతే ।
భ్రాతృ స్త్రిదిన మాశౌచం భ్రాతృపత్న్యా శ్చ నైవ హి ॥

శ్లో॥ అథాన్యత్ర మృతో భ్రాతా భగినీ వా విపద్యతే ।
భగిన్యాః పక్షిణీ తత్ర భ్రాతృ శ్చాశౌచ మిష్యతే ॥ 40

తా॥ తోబుట్టువు గృహమందు భ్రాత చనిపోయినప్పుడును, భాత్రగృహమందు తోబుట్టువు చనిపోయినప్పుడును ఒకరికొకరు అనగా పరస్పరము మూడురోజులు మృతాశౌచమును పట్టవలయును. అట్లు గాక అసన్నిధానమందు చనిపోయినప్పుడు వరస్పరము పక్షిణీమృతాశౌచమును పట్టవలయును.

ఈ విషయములో భర్త ఆశౌచము పట్టునప్పుడు భార్యకు ఆశౌచము లేదు. భార్య పట్టునప్పుడు ఆమె భర్తకు లేదు. కాని పై నుదాహరించిన ప్రకారము భార్య సోదరుడు అనగా స్యాలకుడు చనిపోయినప్పుడు పక్షిణ్యాశౌచము పట్టుట ఆంధ్రాచారమై యున్నది. ఇది గాక భావుకుడు అనగా అక్క మగడు చనిపోయినప్పుడు కూడ సన్నిధానమందు

పక్షిణ్యాశౌచము పట్టుట ఆంధ్రాచారమై యున్నది. కాని ప్రమాణ వచనము మాత్రము ఎచ్చటను కనిపింపలేదు.

శ్లో॥ శవదాహాదికం కర్మ యావ ద్గ్రామాన్తసూతకమ్ ।
జ్ఞాతీనాం దశరాత్ర స్తు వాహక స్తారదర్శనమ్ ॥ 41

తా॥ శవమును దహించువరకు గ్రామమునం దుండు నాలుగు వర్ణములవారికి మృతాశౌచము కలదు. జ్ఞాతులకు పదిరోజులు మృతాశౌచము కలదు. వాహకులకు పగలైన నక్షత్రదర్శనము వరకు మృతాశౌచము కలదు. రాత్రియందైన సూర్యోదయ పర్యన్త మాశౌచ ముండును.

శ్లో॥ పిత్రో రబ్ద మశౌచం స్యాత్ షాణ్మాసం మాతు రేవ చ ।
త్రైమాసిక స్తు భార్యాయా స్తదర్ధం భాతృపుత్రయోః ॥
అన్యేషాం తు సపిండానా మాశౌచం మాససమ్మితమ్ ॥
వ॥ శుభకర్మాణి కార్యా ణ్యకుర్వీత నివృత్తే సూతకే పితుః ।

తా॥ తల్లిదండ్రులు చనిపోయినప్పుడు కర్మచేసినను సంవత్సరము వరకు కుమారులకు దీక్షాశౌచము కలదు. సవతి తల్లికి ఆరుమాసములు, భార్య చనిపోయినప్పుడు భర్తకు మూడుమాసములు, భర్త చనిపోయినప్పుడు భార్యకు కూడ మూడు మాసములు భ్రాతలు, పుత్రులు, చనిపోయినపుడు నలువది అయిదురోజులు ఆశౌచము. జ్ఞాతులకు నెలరోజులు ఆశౌచము. ఈఆశౌచము వెళ్లులోపల శుభకార్యములు చేయగూడదు. అనగా – తాను వారలకు స్వయముగా కర్మచేసినప్పుడని తెలియవలెను.

సూత్రం ॥ పూర్వపిత్రో ర్మృతౌ దత్తః త్రిరాత్రమ్ ॥ 42

దత్తత పోయినవాడు కన్నతల్లిదండ్రులు చనిపోయినప్పుడు సన్నిధానమందు త్రిరాత్ర మృతాశౌచమును పట్టవలయును. ఆ సన్నిధానమందు పక్షిణి, అతిక్రాంతమందు స్నానముచే శుద్ధి.

- అతిక్రాంతాశౌచము -

శ్లో॥ సపిండానా మతిక్రాన్తం సూత్యాశౌచం న విద్యతే।
పితా శ్రుత్వా పుత్రజన్మ స్నానా చ్ఛుద్ధో భవత్యలమ్ ॥

తా॥ జాతాశౌచము పదిరోజులు వెళ్ళిన పిమ్మట విని నేని జ్ఞాతులు తిరిగి ఆశౌచమును పట్టనక్కరలేదు. తండ్రిమాత్రము జాతము వినినయెడల స్నానముతోనే శుద్ధుడగును.

మూ॥ తత్ర జననే ఽతి క్రాన్తాశౌచం నాస్తి।
పితు స్స్నానంత త్రాపి భవతి ॥ 44

మృతకే తు : అనుపనీతమరణ, సమానోదకమరణ, అసగోత్రమరణాది నిమిత్తక త్రిరాత్రాదిషు చాతిక్రాన్తా శౌచం నాస్తి ॥

దశహాది మృతాశౌచ విషయ మేవ ॥

తా॥ జాతాశౌచము అతిక్రాన్త మయ్యెనేని తిరిగి పట్టనక్కరలేదు. తండ్రి మాత్రము స్నానము జేయవలెను. అనుపనీతమరణ, సమానోదకమరణ, అసగోత్రమరణ త్రిరాత్రములకు అతిక్రాన్తాశౌచము లేదు. పదిరోజులు పట్టదగిన మృతాశౌచము సకాలములో తెలియక పదిరోజులు వెళ్ళిన పిమ్మట వినెనేని తిరిగి పట్టవలయును. ఎట్లనగా-

శ్లో॥ ఆత్రిమాసా త్త్రిరాత్రం స్యాత్ షణ్మాసా త్పక్షిణీ భవేత్।
అహ స్తు నవమా దర్వా గూర్ధ్వం స్నానేన శుధ్యతి ॥ 45

శ్లో॥ మాసత్రయే త్రిరాత్రం స్యాత్ షణ్మాసం పక్షిణీ భవేత్ ।
అహస్తు నవమాసం స్యా దూర్ధ్వం స్నానేన శుద్ధ్యతి: ॥

ఇ త్యేకదేశ విషయః -

తా॥ మరణాది మూడుమాసముల లోపల పదిరోజులమైల తెలిసెనేని మూడురోజులు పట్టవలయును. ఆరుమాసముల లోపల తెలిసెనేని పక్షిణి పట్టవలయును. తొమ్మిది మాసముల లోపల వినెనేని తెలిసెనేని పక్షిణి పట్టవలయును. అటుపిమ్మట తెలిసెనేని స్నానముతోనే ఒకరోజు పట్టవలయును. ఈ అతిక్రాన్తాశౌచము ఏకదేశ విషయమని శుద్ధియగును. దేశభేదమున్నయెడల అతిక్రాంతాశౌచము తెలియవలెను. పట్టనక్కరలేదు.

- దేశభేదనిర్ణయః -

శ్లో॥ మహానద్యద్రిభి స్సమ్య గ్వ్యవధానం యధా భవేత్ ।
భాషాభేదో ఽపి వా యత్ర స్నానా చ్ఛుద్ధ్యన్తి జ్ఞాతయః ॥

తా॥ మహానదులు గాని మహాపర్వతములు గాని భాషా భేదములు గాని ముప్పదియామడలదూరము వ్యవధానమున్నయెడల అది దేశభేద మనిపించుకొనును. ఈభేదమున్నపుడు జ్ఞాతులు అతిక్రాంతాశౌచమును పట్టనక్కరలేదు. అప్పుడు స్నానముతోనే శుద్ధి యగును.

శ్లో॥ భాషాభేదో మహానద్యాం వ్యవధాన మథాద్రిభిః ।
త్రింశద్యోజనదూరం వా ప్రత్యేక దేశభేదతః ॥ 48

తా॥ భాషాభేద మున్నను మహానదులు పర్వతములు అడ్డమున్నను ముప్పదియామడల దూరమున్నను దేశభేద మని చెప్పబడును.

శ్లో॥ దేశాన్తరే ఽపి మరణే దశాహోభ్యన్తరే యదా ।
శ్రవణం స్యాత్సపిండానాం శేషాహం మృతకం భవేత్ ॥49

తా॥ దేశభేద మున్నగు మరణాది పదిదినములలోపల విన్నయెడల జ్ఞాతు లందరు శేషించినదినములు ఆశౌచమును పట్టవలయును.

శ్లో॥ పితరౌ చే న్మృతౌ స్యాతాం దూర స్థో ఽపి హి పుత్రకః ।
దశాహోభ్యన్తరే శ్రుత్వా శేషాహై శ్చ విశుధ్యతి ।
దశాహోనన్తరే శ్రుత్వా దశాహం మృతకం చరేత్ ॥

తా॥ దేశాంతరమందు పుత్రులు దూరస్థులై తల్లిదండ్రుల మరణమును పదిదినములలోపల విన్నయెడల మిగిలినదినములతోనే పరిశుద్ధు లగుదురు. అట్లు గాక పది దినములు వెళ్ళిన పిమ్మట వినినచో విన్నది మొదలుకొని పది దినములు ఆశౌచమును ఆచరించ వలయును.

శ్లో॥ సంవత్సరే ష్వతీతే ష్వప్యహర్దశక మీరితమ్ ।
అకృతే ప్రేతకార్యే చ త్విద మాశౌచ మిష్యతే ॥ 51

తా॥ అనేకసంవత్సరములు గడచినను ప్రేతకార్యము కాకున్న యెడల పుత్రులు పది దినములు ఆశౌచము పట్టవలయును.

శ్లో॥ కృతక్రియే పితరి త్వాశౌచ మిద మూచిరే ।
వింశతి ర్వత్సరా యావ దహర్దశక మీరితమ్ ।
తదూర్ధ్వం త్రిదినం ప్రోక్తం ఇతి సర్వే వదన్తి హి ॥ 52

తా॥ కొంతమంది పుత్రులు తండ్రికి నుత్తరక్రియ లాచరించినను కర్మ చేయనికుమారులు ఇరువది సంవత్సరములవరకు పది దినములు ఆశౌచ మవలంబించవలె ననియు, అటు పిమ్మట మూడుదినము లాశౌచము పట్టవలె ననియు చెప్పుదురు.

శ్లో॥ ఏవం పత్న్యాః పతిః కుర్యా త్పుత్య ర్భార్యా త థైవ చ ।

తా॥ ఈప్రకారముగానే భార్యకు భర్తయు, భర్తకు భార్యయు దేశాంతరమందు ఆశౌచ మనుష్ఠించవలెను.

శ్లో॥ ఏవం సపత్న్యో ర్మరణే పరస్పర ముదాహృతమ్ । 54

తా॥ ఇట్లే సవతులకును పరస్పరము ఆశౌచము చెప్పబడియున్నది.

శ్లో॥ దేశాన్తరే తు పుత్రస్య మరణం యది సంభవేత్ ।
దశాహాభ్యంతరే శ్రుత్వా దశాహం మృతకం చరేత్ ॥

శ్లో॥ తదూర్ధ్వం శ్రవణే ప్రోక్తం యావద్వర్షం దినత్రయమ్ ।
తదూర్ధ్వం శ్రవణే ప్రోక్తం స్నాన మేకే దినం విదుః ॥ 55

తా॥ దేశాంతరమందు పుత్రమరణము పదిరోజులలోపల విన్నయెడల శేషించినదినములతోనే శుద్ధి యగును. ఆ వెనుక సంవత్సరమువరకు మూడురోజు లుండవలయును. తరువాత స్నానముతోనే నివర్తించును. కొంద రొక్కదిన మని చెప్పుచున్నారు. ఈ యాశౌచము ఉత్తరక్రియలు జరిగినవారివిషయము.

శ్లో॥ అకృతే ప్రేతకార్యే తు వర్షా దూర్ధ్వమపి త్ర్యహమ్ ।
పరే వదన్తి పుత్రస్య మరణే యత్ర కుత్రచిత్ ॥ 56

సపిండస్య యథాశౌచం తద్వ దేవ భవే దితి ॥

తా॥ ఉత్తరక్రియలు జరుగనియెడల నేడాది వెనుక గూడ మూడురోజు లాశౌచము. దేశాంతరమందు నసపిండుల కెట్లో పుత్ర మరణమున కూడ అట్లే నని మరి కొందరు చెప్పుచున్నారు.

శ్లో॥ అసగోత్రే సగోత్రే వా యదుక్తం త్రిదినం వ్యాఘమ్ ।
పక్షిణీం వా దినం వా పీ త్యేకకాల మ థాపి హి ॥ 57

శ్లో॥ ఖండాశౌచ మిదం ప్రోక్త మతీతే స్నాన మాచరేత్ ।
ఇ త్యేవం సర్వశాస్త్రాణం రహస్యం సమ్మతం పరమ్ ॥

తా॥ సగోత్రులవిషయమై గాని యసగోత్రులవిషయమై గాని చెప్పబడిన త్రిరాత్రపక్షిణ్యాద్యాశౌచములు ఖండాశౌచంబు లనంబడును. ఈఖండాశౌచములకు ఉక్తకాలము గడచిన తరువాత స్నానమాత్ర మని సర్వశాస్త్రసమ్మతము.

శ్లో॥ దశాహా త్పరతో దాహ స్త్వస్థాం చైవ యథా భవేత్ ।
గృహీతాశౌచినః పుత్రా స్త్రిదినా చ్ఛుద్ధి మాప్నుయుః ॥

శ్లో॥ యది దాహః ప్రతికృతే స్తదా తేషాం దినత్రయమ్ । 59

తా॥ పది దినములు గడచిన పిమ్మట తల్లిదండ్రుల అస్థిదహనము జరిగినయెడల పుత్రులు పూర్వము ఆశౌచ మవలంబించియున్న యెడల దహనము మొదలుగ మూడురోజులు ఆశౌచ మవలంబించ వలెను. పలాశదహనమునకు కూడ ఇట్లే యాచరించవలెను.

శ్లో॥ అస్థాం చ దహనే చైవ దాహే ప్రతికృతే స్తథా ।
అగృహీతాశౌచినాం తు పుత్రాణం దశరాత్రకమ్ ॥ 60

శ్లో॥ అగృహీతాశౌచినాం తు సపిండానాం త్ర్యహంస్మృతమ్ ॥

తా॥ అస్థిదహనము మొదలుగ గాని ప్రకృతిదహనము మొదలుగ గాని అగృహీతాశౌచు లగుపుత్రులు పదిరాత్రులాశౌచ ముండవలయును. అట్లే అగృహీతాశౌచు లగు సపిండులు మూడునాళ్లుండవలెను.

శ్లో॥ కృతోదకా స్సపిండా శ్చ గృహీతాశౌచిన శ్చ యే ।
తేషాం న కించి దాశౌచ మేకాహం త్వకృతోదకాః ॥

తా॥ ఆశౌచ మవలంబించి యుదకదానము చేసిన సపిండులకు అస్థి ప్రకృతి దాహాశౌచము కొంచెమైనను లేదు. ఉదకక్రియలు చేయనివారికి పదియవనాడు మాత్ర ముదకదాన ప్రయుక్తాశౌచము కలదు.

శ్లో॥ ప్రమీతపితృకః పుత్ర స్త్వౌర్ధ్వదైహిక మాచరేత్ ।
యది కర్తు మశక్త స్స్యా దాశౌచనియమాన్వితః ॥ 63

శ్లో॥ ఆదశాహా ద థోర్ధ్వ న్తు యదా కార్యక్షమ స్తదా ।
త్రిరాత్రం సమతిక్రమ్య శ్రాద్ధం కుర్యా ద్యథావిధి ॥

తా॥ పుత్రుడు తల్లిదండ్రుల మరణదినము మొదలు క్రమముగా నౌర్ధ్వదైహిక క్రియలు చేయవలయును. అట్లు పది దినములకు లోపల చేయ శక్తి లేనివాడు పది దినములు ఆశౌచనియమాన్వితుడై బహిర్దశాహమందు మూడురోజులు ఆశౌచ మవలంబించి యథావిధిగా శ్రాద్ధము చేయవలెను. అనగా మూడవరోజున శిలోద్వాసనము చేసి నాల్గవరోజున షోడశాంతమువరకు జరిపి అయిదవరోజున సపిండీకరణము మాత్రము చేయవలయును. ఊనమాసికమును మరణాది ఇరువదిఎనిమిది, ఇరువదితొమ్మిది, ముప్పదిదినముల యందు జరుపవలెను. ఈయుక్తకాల మతిక్రమించినయెడల మరల చేయనక్కరలేదు.

శ్లో॥ దాహక స్త్వేత దాశౌచం సపిండానాం న విద్యతే ।
అదత్తోదకజ్ఞాతీనాం తదర్ధ మహ రీరితమ్ ॥ 64

తా॥ ఈయాశౌచము కర్తకే గాని సపిండులకు లేదు. శిలమీద తిలోదక దానము చేయనివారు ఉదకదానము చేసినయెడల ఆ రోజుమాత్రము అశౌచ మవలంబించవలెను.

శ్లో॥ గృహీతాశౌచిపుత్రస్య ప్రేతకర్మా ణ్యకుర్వతః ।
దశాహానన్తరం నిత్యనైమిత్తిక మథాపి వా ।
నకుర్యా త్తావ దాశౌచం యావ త్ప్రేతవిమోక్షణమ్ ॥

తా॥ అశౌచ మవలంబించి ప్రేతక్రియలు చేయనిపుత్రుడు దశాహానంతరమందు ప్రేతత్వమున్నంతవరకు అశౌచము కలవాడు గావున అవి తీరువరకు నిత్యనైమిత్తిక కలాపమును చేయగూడదు. అనగా సన్ధ్యావంద నౌపాసనములు మాత్రము చేయవచ్చును.

– ఆశౌచసంపాతవిషయః –

శ్లో॥ సమానాశౌచమధ్యే తు శ్రవణం స్యా త్సమానయోః ।
ఆశౌచయో స్తదా పూర్వగృహీతే నైవ శుధ్యతి ॥ 66

తా॥ పదిరోజుల జాతాశౌచమధ్యమం దట్టి పదిరోజుల మృతాశౌచ మధ్యమందు, అట్టి పదిరోజుల మృతాశౌచము సంభవించినను, అవి పూర్వ మవలంబించిన యాశౌచముతోనే నివర్తించును. పరాశౌచమును పట్టనక్కరలేదు.

శ్లో॥ పూర్ణాశౌచే గృహీతే తు దశమే తు దినే పునః ।
పూర్ణాశౌచం యది భవే చ్ఛుద్ధిః కేన భవే దితి ॥ 67

శ్లో॥ దినద్వయేన శుద్ధి స్స్యా త్పూర్ణాశౌచా దితి స్థితిః ।
యా మేష్టమే చే చ్ఛ్రవణం త్రిరాత్రే ణైవ శుధ్యతి ॥

తా॥ సంపూర్ణమైన జాతాశౌచము గాని మృతాశౌచము గాని అవలంబించియుండగా పదియవనాడు మరల అట్టి జాతాశౌచములో జాతాశౌచము గాని, మృతాశౌచములో మృతాశౌచము గాని వచ్చినయెడల తరువాత రెండురోజులు ఆశౌచ ముండవలయును. పదియవరోజు ఎనిమిదవజామున విన్నయెడల మూడునాళ్లుండ వలయును.

అత్ర విశేషః ॥

శ్లో॥ పూర్ణాశౌచే గృహీతే తు దశాహో స్తమయాత్పరమ్ ।
పూర్ణాశౌచం యది భవే త్త థైవ స్యా ద్దినద్వయమ్ ।
యామేష్టమే తు త్రిదిన మిత్యేకే ప్రవదన్తి హి ॥ 68

తా॥ పూర్ణాశౌచమును అవలంబించి యుండగా పదియవనాడు సూర్యాస్తమయమైన తరువాత అట్టి పూర్ణాశౌచమును విన్నయెడల మరల రెండురోజు లనియు, యెనిమిదవజామున విన్నయెడల మూడురోజు లనియు కొందరిఅభిప్రాయ మైయున్నది. ఈ విషయములో రెండవమతమే యుక్తము.

శ్లో॥ అధికాశౌచమధ్యే తు న్యూనాశౌచం పతే ద్యది ।
అధికే నైవ శుద్ధిః స్యా న్న తు న్యూనేన శుధ్యతి ॥

తా॥ అధికాశౌచమధ్యమందు న్యూనాశౌచము వచ్చినయెడల అధికాశౌచముతోనే శుద్ధి గాని తక్కువ ఆశౌచముచేత శుద్ధి కలుగదు.

శ్లో॥ సూత్యాశౌచే సముత్పన్నే శావాశౌచం పతే ద్యది ।
న్యూనం స్యా దధికం వా స్యా చ్ఛావే నైవ విశుధ్యతి ॥

తా॥ సంపూర్ణ జాతాశౌచమధ్యమందు త్రిరాత్ర మృతాశౌచము గాని సంపూర్ణ మృతాశౌచము గాని వచ్చినయెడల ఆమృతాశౌచము చేతనే శుద్ధి గాని జాతాశౌచముచే శుద్ధి కాదు.

శ్లో॥ న్యూనశావే సముత్పన్నే పూర్ణసూతక మాపతేత్ ।
తదా న్యూనేన శావేన శుద్ధి రి త్యేక ఊచిరే ।
దేశాచారప్రభేదేన జ్ఞాతవ్య మితి నిశ్చయః ॥ 71

తా॥ మూడురోజుల మృతాశౌచములో పదిరోజుల జాతాశౌచము వచ్చినయెడల త్రిరాత్ర మృతాశౌచము చేతనే శుద్ధియగు నని కొందరు చెప్పుచున్నారు. మరికొందరు పదిరోజుల జాతాశౌచముతోనే శుద్ధికాని త్రిరాత్ర మృతాశౌచముచేత శుద్ధికా దని చెప్పుచున్నారు. ఇక్కడ దేశాచారము ననుసరించి ఆచరించవలయునని చెప్పబడియున్నది. ఇక్కడ రహస్యమైన శాస్త్రార్థమేమనగా రెండు మతములు ఆచరించతగినవై యున్నది. ఎట్లనగా -

శ్లో॥ సాపిండ్యానుపనీతసోదకమృతే శ్శావా త్త్రిరాత్రా త్తథా ।
శుద్ధిం యాతి దశాహజాత మపి వా నో యాతి తన్న్యూనతః
సాపిండ్యే తు దశాహకా దుపరి చే చ్ఛావా త్త్రిరాత్రా త్తథా ।
నో శుధ్యే దసగోత్రజస్య మరణే ఽ ప్యేవం త్రిరాత్రా దపి ॥

తా॥ అనుపనీత సమానోదక త్రిరాత్ర మృతాశౌచములచే పదిరోజులు పురుడు శుద్ధియగును. అతిక్రాంత త్రిరాత్ర మృతాశౌచముచేతను అసగోత్ర త్రిరాత్ర మృతాశౌచము చేతను పదిరోజులు పురుడు శుద్ధికా దని భావము. ఇది సర్వసమ్మతము.

శ్లో॥ వర్తమానే పరాశౌచే పూర్వాశౌచం శ్రుతం యది ।
పూర్వే ణైవ విశుద్ధి స్స్యా న్నాపరేణ విశుధ్యతి ॥ 73

తా॥ పరాశౌచము నవలంబించియుండగా పూర్వాశౌచము విన్నయెడల పూర్వాశౌచముతో నివర్తించును గాని పరాశౌచముతో నివర్తించదు.

శ్లో॥ జ్ఞాత్యాశౌచే సముత్పన్నే పిత్రాశౌచం పతే ద్యది ।
న పూర్వేణ విశుద్ధి స్స్యాత్పిత్రాశౌచేన శుధ్యతి ॥ 74

తా॥ జ్ఞాత్యాశౌచము నవలంబించి యుండగా తండ్రి చనిపోయిన యెడల పిత్రాశౌచముతో శుద్ధిగాని పూర్వ శౌచముతో శుద్ధి కానేరదు.

శ్లో॥ మాత్రాశౌచస్య మధ్యే తు పితా తు మ్రియతే యది ।
పితు ర్మరణ మారభ్య పుత్రాణాం దశరాత్రకమ్ ॥ 75

తా॥ తల్లియాశౌచము నడుమ తండ్రి మృతినొందెనేని తండ్రి మరణము మొదలుగ పదిరోజులు కుమారులు ఆశౌచ ముండ వలయును.

శ్లో॥ పిత్రాశౌచస్య మధ్యే తు యది మాతా ప్రమీయతే ।
దశాహో త్పైతృకా దూర్ధ్వం మాతృకం పక్షిణీ భవేత్ ॥

తా॥ పిత్రాశౌచమధ్యమందు మాత్రాశౌచము సంభవించిన యెడల పిత్రాశౌచము వెళ్ళిన పిమ్మట మాత్రాశౌచము పక్షిణి నాచరించ వలయును.

శ్లో॥ దేశాన్తరస్థితౌ మాతాపితరౌ చ మృతౌ యది ।
ఏకస్మి న్నేవ కాలే తు శ్రవణం స్యా త్తదా తయోః ॥ 77

శ్లో॥ తత్ర తంత్రేణ శుద్ధి స్స్యా దితి సర్వే వదన్తి హి ।
దూరస్థో ఉ ప్యాచరే త్పుత్రో హ్యాశౌచం తూభయో స్సమమ్॥

తా॥ దేశాంతరమందుగాని కాలాంతరమందుగాని తల్లిదండ్రుల మరణమును బహిర్దశాహమందు దూరస్థుడైన పుత్రుడు ఏకకాలమందు విన్నయెడల వారికి సమానతంత్రముచే పదిరోజు లాశౌచము ననుష్ఠించి పితృపూర్వకముగ కర్మ చేయవలెను. ముందు చెప్పిన ట్లీవిషయమందు పిత్రాశౌచమునకు పిమ్మట మాత్రాశౌచము పక్షిణి యాచరింప నక్కరలేదు.

శ్లో॥ **పితు ర్దశాహమధ్యే తు మరణం శ్రూయతే యది ।**
కృతక్రియాయా మాతు శ్చే త్పిత్రాశౌచేన శుధ్యతి ॥ 78

తా॥ అన్నగాని తమ్ముడుగాని కొంతమంది పుత్రులు పితృమేధము జరిగించి పిత్రాశౌచ మధ్యమందు తల్లి మరణమును విన్నయెడల కుమారులకు పిత్రాశౌచముతో మాత్రాశౌచము నివర్తించును. తల్లి పక్షిణ్యాశౌచము పట్టనక్కరలేదు.

శ్లో॥ **అసంస్కృతాయా మాతు శ్చ మరణం శ్రూయతే యది ।**
దశాహాత్పైతృకా దూర్ధ్వం మాతృకం పక్షిణీ భవేత్ ॥

తా॥ అట్లు పితృమేధము జరుగకుండగనే తల్లి మరణమును విన్నవాడు పిత్రాశౌచము గడచిన పిమ్మట మాత్రాశౌచము పక్షిణినీ అవలంబించవలెను.

శ్లో॥ పిత్రాశౌచాన్తిమదినే మాత్రాశౌచం పతే ద్యది ।
దినద్వయేన శుద్ధిః స్యా త్ప్రభాతే త్ర్యహ మీరితమ్ ॥ 80

తా॥ పిత్రాశౌచదశమ దినమందు మాత్రాశౌచము సంభవించిన యెడల పిత్రాశౌచమునకు పిమ్మట రెండురోజులు మాత్రాశౌచ ముండవలెను. అష్టమయామ మందైన మూడురోజు లుండవలయును.

శ్లో॥ జ్ఞాత్యాశౌచే గృహీతే తు యది భార్యా ప్రసూయతే ।
మాతా శుధ్యే త్సకాలేన పితాశుధ్యే ద్దశాహతః ॥

తా॥ జ్ఞాతియొక్క మృతాశౌచ మధ్యమందు భార్య ప్రసవించినయెడల భర్త పదినాళ్లు జాతాశౌచ మవలంబించవలయును. భార్య ముప్పది రోజులకు పరిశుద్ధురాలగును.

శ్లో॥ జ్ఞాత్యాశౌచస్య మధ్యే తు జ్ఞాతిదాహం చరే ద్యది ।
దాహ మారభ్య చాశౌచం దశాహ స్తు విధీయతే ॥ 82

తా॥ జ్ఞాత్యాశౌచ మధ్యయందు స్వకర్తవ్యముచే మరియొక జ్ఞాతికి దహనకర్మ చేసినయెడల దహనక్రియ మొదలుకొని పదిరోజులు మృతాశౌచ ముండవలయును.

శ్లో॥ స ఏవ చ పున ర్యాతి దాహకర్మ య దాచరేత్ ।
పూర్వశేషేణ శుద్ధి స్స్యా త్పున ర్నాశౌచ మిష్యతే ॥

తా॥ ఆదాహకుడే మరల నింకొక జ్ఞాతిని స్వకర్తృకముచే దహనము చేసినయెడల వానికి పూర్వాశౌచముతో పరాశౌచము నివర్తించును.

శ్లో॥ స ఏవ చ పున ర్మాతా పితృదాహం య దాచరేత్ ।
దాహకస్య త దన్యేషాం పుత్రాణాం దశరాత్రకమ్ ।
న పూర్వేణ విశుద్ధి స్స్యాదితి శాస్త్రవిదాం మతమ్ ॥ 84

తా॥ ఆదాహకుడే మరల తల్లికిగాని తండ్రికిగాని దహన కర్మ చేయవలసి వచ్చినప్పుడు తానుగాని తన పుత్రులుగాని పదిరోజు లాశౌచ ముండవలయును. ఇది సర్వసమ్మతము.

శ్లో॥ పిత్రో ర్మృత్యస్తరాళే తు స్వభార్యా చే త్ప్రసూయతే ।
పిత్రాశౌచేన శుద్ధి స్స్యా త్పుత్ర్యా శ్శుద్ధి స్వకాలతః ॥ 85

తా॥ తల్లిదండ్రుల యాశౌచమధ్యమందు భార్య ప్రసవించినయెడల తనకు పిత్రాశౌచముతో ఆశౌచము నివర్తించును. బాలెంతరాలికి మాత్రము జాతాశౌచము పదిరోజులతో శుద్ధియగును. విశేష మేమనిన మగశిశువుకు నెలరోజులకు శుద్ధి, ఆడపిల్లకు ఇరువదిరోజులకు శుద్ధియని తెలియవలెను.

శ్లో॥ **జ్ఞాత్యాశౌచస్య మధ్యే తు స్వభార్యా మ్రియతే యది ।**
మరణాదిదశాహం స్యా న్న పూర్వేణ విశుధ్యతి ॥ 86

తా॥ జ్ఞాత్యాశౌచమధ్యమందు కుమారు లుండినను తన భార్య చనిపోయినయెడల మొదటిపదిరోజులు మృతాశౌచముండవలెను. గాని అది పూర్వాశౌచముతో నివర్తింపదు

శ్లో॥ **పత్యు ర్మృతౌ తు భార్యాయా ఏవ మేవ భవే దఘమ్ ।**
పుత్రస్య మరణే చాపి హ్యఘం పూర్వవ దీరితమ్ ॥ 87

తా॥ పతి మరణమున భార్య ఇట్లే యాచరింపవలెను. పుత్రమరణమున తల్లిదండ్రులు ఇట్లే యాచరించవలెను. ఈ మూడు విషయములలో పూర్వగృహీతాశౌచముతో పరిశుద్ధి కలుగదు.

– గ్రామాశౌచనిర్ణయః –

శ్లో॥ యావద్గ్రామస్య మధ్యే తు శవ స్తిష్ఠ త్యసంస్కృతః ।
తావ ద్గ్రామస్య చాశౌచం తదా హోమజపాదికమ్ ॥
నిత్యం నైమిత్తికం వా పృధ్యయనాది వివర్జయేత్ ॥ 88
గృహే వశ్వాదౌ మృతే ఽ ప్యేవమ్ ॥

తా॥ శవము సంస్కారము పొందక గ్రామమధ్యయం దెంతవరకు ఉండునో యంతవరకు గ్రామమున కాశౌచము కలదు. అప్పుడు

జపహోమాది నిత్యక్రియలను వేదాధ్యయనాదులను చేయకూడదు. గృహమందు పశ్వాదుల మరణమైనచో ఈ ప్రకారమే జరుపవలెను.

శ్లో॥ ఆరబ్ధవైశ్వదేవాది యధావిధి సమాచరేత్ ।
విప్రః శ్రౌతాగ్నిహోమ స్తు కుర్యా దే వావిచారయన్ ॥

తా॥ అంతకుమున్ను ఆరంభించిన వైశ్వదేవాదులను యధావిధిగా చేయవలెను. బ్రాహ్మణుడు శ్రౌతాగ్నిలో హోమమును విచారింపకయే చేయవలెను.

శ్లో॥ దేవార్చనాయా మధ్యే చే త్తన్త్రే ణైవ సమాపయేత్ ।
దేవప్రతిష్ఠామధ్యే చే ద్దాహయిత్వా సమాపయేత్ ॥ 90

తా॥ దేవార్చన మధ్యయందైన తంత్రముతో పూజను ముగించవలెను. దేవతా ప్రతిష్ఠ నడుమ నైనయెడల శవమును దహించినపిమ్మట నాప్రతిష్ఠ పూర్తి చేయవలెను.

శ్లో॥ శవే బహిర్గతే దగ్ధే గ్రామాశౌచం నివర్తతే ।
గృహ స్యా ప్యేవ మేవ స్యా ద్గృహే ప్రేతక్రియా న చేత్ ।
గృహస్వామిన ఆశౌచే గృహాశౌచం పరే విదుః ॥ 91

తా॥ శవమును ఊరి వెలుపలికి గొనిపోయినను దహించినను పిమ్మట గ్రామాశౌచము నివర్తించును. గృహమందు ప్రేతక్రియలు జరుగని యెడల నిట్లే గృహాశౌచము నివర్తించును. గృహస్వామికి ఆశౌచ మున్నంతవరకు గృహమునకు కూడ ఆశౌచము కల దని కొందరి యభిప్రాయము.

శ్లో॥ ఏకాదశధనుర్మాత్రవ్యవధానం యదా భవేత్ ।
తదా వీధ్యన్తర స్యాస్య నాశౌచం విద్యతే క్వచిత్ ॥ 92

తా॥ శవమున్నచోటికి పదునొకండు ధనుస్సుల దూరమున్న మరియొక వీధికి అశౌచము లేదు.

ధనుః ప్రమాణము ఒక గజము.

శ్లో॥ యస్మి న్ననాగన్తుకా శ్చ విప్రా స్సన్తి చతుశ్శతమ్ ।
తస్య గ్రామస్య నాశౌచం నగరస్య న తద్భవేత్ ॥ 93

తా॥ ఏ గ్రామమందు ఆగంతుకులు గాక నాలుగువందల బ్రాహ్మణులు నివసింతురో ఆ గ్రామమునకును, నగరమునకును అనగా పట్టణమునకును అశౌచము లేదు.

శ్లో॥ కిన్తు తద్గృహమాత్రస్య స్వల్పగ్రామస్య త ద్భవేత్ ।

తా॥ ఆశౌచము తద్గృహమునకును, స్వల్పగ్రామమునకును కలదు.

శ్లో॥ స్త్రీశూద్రా నుపనీతానా మనాథానం తథైవ చ ।
గ్రామమధ్యే శవ స్తిష్ఠే న్నాశౌచ మితి కీర్తితమ్ ॥ 95

తా॥ గ్రామమధ్యమందు స్త్రీలయొక్కయు, శూద్రుల యొక్కయు, అనాథలయొక్కయు, అనుపనీతునియొక్కయు శవముండినను గ్రామమునకు అశౌచము లేదు.

శ్లో॥ శవదాహాదికం కర్మ యావద్గ్రామాన్తసూతకమ్ ।
జ్ఞాతీనాం దశరాత్ర స్తు వాహక స్తారదర్శనమ్ ॥ 96

తా॥ శవమును దహించునంతవరకు గ్రామమునకు అశౌచము. జ్ఞాతులకు పదిరాత్రు లాశౌచము. వాహకులకు పగలు మోసిన యెడల నక్షత్రదర్శనము వరకాశౌచము. రాత్రిమోసిన యెడల సూరోద్యయము పర్యంత మాశౌచము.

శ్లో॥ సూతకా ద్ద్విగుణం శావం శావాద్ద్విగుణ మార్తవమ్ ।
ఆర్తవా ద్ద్విగుణం సూతి స్తతోపి శవదాహకః ॥ 97

తా॥ జాతముకంటె మృతకము రెండురెట్లధికము. మృతముకంటె ఆర్తవము అనగా రజస్సు రెండు రెట్లధికము. ఆర్తవముకంటె ప్రసూతి రెండురెట్లధికము. ప్రసూతికంటె దాహాశౌచము రెండురెట్లధికమని తెలియవలెను.

శ్లో॥ తండులాదీని ద్రవ్యాణి సువర్ణ వసనాని చ ।
ఆశౌచిన స్సకాశా త్తు న గ్రాహ్యాని చ సర్వదా ॥ 98

తా॥ బియ్యము మొదలగు వస్తువులను, ద్రవ్యమును, వస్త్రములను, సర్వదా ఆశౌచము గలవానిచేతినుండి పుచ్చుకొనగూడదు.

శ్లో॥ మధుపుష్పగుడాదీని శాకమూలఫలాని చ ।
లవణం తృణకాష్ఠాది తైల మౌషధ మేవ చ ॥
వినైవ స్వామినో హస్తస్పర్శం గ్రాహ్యాని చాజ్ఞయా ॥

తా॥ తేనె, పువ్వులు, బెల్లము, కూరగాయలు, కందమూలములు, పండ్లు, లవణము, తృణకాష్ఠాదులు, తైలము, మందు, మొదలగు వస్తువులను, యజమాని హస్తమున నుండి గాక యజమానుని యాజ్ఞచే ఇతరులవలన పుచ్చుకొనవచ్చును.

శ్లో॥ గ్రాహ్యం జలం కూపగతం, ధాన్యం క్షేత్రగతం తథా ।
దధి క్షీరం ఘృతం తక్రం పరై ర్గ్రాహ్యం విపశ్చితా ॥।

తా॥ బావిలోని నీళ్ళను, క్షేత్రమందున్న ధాన్యమును, పెరుగు, పాలు, నెయ్యి, మజ్జిగ వీనిని యజమానికన్న నితరుల వలన పుచ్చుకొనవచ్చును.

శ్లో॥ అతిక్రాన్తా శౌచినో యే సంపర్కాశౌచిన శ్చ యే ।
తై ర్దత్తం తండులాద్యం చ గ్రాహ్య మేవ న సంశయః ॥101

తా॥ ఆశౌచము తొలగినవారును, మైలపడినవారును, తండులాదులు ఇచ్చినను, నిస్సంశయముగ పుచ్చుకొనవచ్చును.

శ్లో॥ స్వామీహస్తస్య సంస్పర్శం వినా తద్దోషకృ న్న హి ।

తా॥ యజమానుడు తాకిన వస్తువులు దోషగ్రస్తములని భావము.

శ్లో॥ భోక్తు ర్వా దాతు రే వాథ త్వాశౌచం స్యా త్తదా కథమ్ ।
న భోక్తవ్యం న దేయం స్యా దితి సర్వై రుదాహృతమ్ ॥

తా॥ భోక్తకుగాని, దాతకు గాని యాశౌచము వచ్చినప్పుడు భుజింపగూడదు. పెట్టగూడదు.

శ్లో॥ దాతు ర్భోజనమధ్యే తు జ్ఞాత్యాశౌచం పతే ద్యది ।
పాత్రస్థ మన్నం భోక్తవ్యం న గ్రాహ్యం భాండమధ్యగమ్ ॥

తా॥ భోజనమధ్యమందు దాతకు జ్ఞాత్యాశౌచము వచ్చిన యెడల భోక్త విస్తరిలో నున్న యన్నమునే భుజించవలెను. గాని తిరిగి భాండములోనున్న అన్నమును పెట్టించుకొని భుజించగూడదు.

శ్లో॥ ఉత్తరాపోశనం పాదహస్తప్రక్షాళనం తథా ।
పాదప్రక్షాళనం చాపి శుద్ధాచమన మేవ చ ॥ 105

శ్లో॥ అన్యగేహోదకే నైవ కుర్యా దే వేతి నిశ్చయః ।
తత్కాలే తద్గృహస్థాద్భి ర్న కార్య మితి నిర్ణయః ॥

తా॥ ఉత్తరాపోశనమునకును హస్తప్రక్షాళన పాదప్రక్షాలన శుద్ధాచమనములకును వేరొక ఇంటి నీటినే ఉపయోగింపవలెను గాని ఆ ఇంటినీటితో చేయరాదు.

శ్లో॥ వ్రతాదేశే వివాహే చ చౌలే సీమన్తే ఏవ చ ।
దేవప్రతిష్ఠాయజ్ఞేషు దేవోత్సవ ఏవచ ॥ 106

శ్లో॥ సంప్రాప్తే సూతకే తత్ర తదీయం తండులాదికమ్ ।
పూర్వ మేవ బ్రాహ్మణేభ్యో దేవతాయై వినిశ్చితమ్ ॥

శ్లో॥ తత్స్వామీహస్తస్పర్శేన వినా గ్రాహ్యం పరై స్స్వయమ్ ॥

తా॥ ఉపనయనమందును, వివాహమందును, చౌలమందును, సీమంతమందును, దేవప్రతిష్ఠయందును, యజ్ఞమందును, దేవోత్సవము నందును, యజమానుని కాశౌచము వచ్చినప్పుడు తదీయతండులాది ద్రవ్యము తత్పూర్వమే దేవతలకు గాని, బ్రాహ్మణులకు గాని నిర్ణయింపబడి యుండుటవలన నా వస్తువులను యజమానుని హస్తస్పర్శనము లేక యన్యునివలన బ్రాహ్మణులు గ్రహించవచ్చును.

శ్లో॥ ఆశౌచా త్పూర్వ మే వాత్ర చాన్నం పక్వస్థితం యది ।
పరివేషిత మన్యై శ్చే ద్భోజ్య మాహు ర్మనీషిణః ।
ఏభ్యో ఽన్యత్ర నభోజ్యం స్యా దితి సర్వే వదన్తి హి ॥ 107

తా॥ ఆశౌచమునకు ముందే అన్నమును, పక్వమైన పదార్థములును, సిద్ధమైన యెడల అది ఇతరులు వడ్డించినచో భుజింపవచ్చును అటుగానిచో భుజింపగూడదు.

శ్లో॥ ప్రారంభో వరణం యజ్ఞే సంకల్పో వ్రతసత్రయోః ।
నాందీముఖం వివాహే చ శ్రాద్ధే పాకపరిక్రియా ॥ 108

తా॥ యజ్ఞమందు వరణలు ఇచ్చిన పిమ్మటను, వ్రతసత్రముల యందు సంకల్పము చేసిన పిమ్మటను, వివాహమునందు నాంది అయిన పిమ్మటను, శ్రాద్ధమునందు పాకప్రోక్షణ అయిన పిమ్మటను

ఆశౌచము వచ్చినయెడల ఆకార్యములు సలుకప సాంగముగా చేయవలయును.

– ఆశౌచినాం సంధ్యావందనాది విషయః –

శ్లో॥ దానం ప్రతిగ్రహో హోమ స్స్వాధ్యాయః పితృకర్మ చ ।
ప్రేతపిండక్రియావర్జ మాశౌచే వినివర్తతే ॥ 109

శ్లో॥ అపత్కాలే తు సంప్రాప్తే శౌచాచారం న చింతయేత్ ।
శుద్ధిం సమాచరేత్ పశ్చా దితి వేదవిదో విదుః ॥

శ్లో॥ రాష్ట్రక్షోభే నృపాక్షిప్తే రోగార్తే శావసూతకే ।
సంధ్యావందనవిచ్ఛిత్తి ర్న దోషాయ కదాచన ॥ 111

శ్లో॥ సూతకే కర్మాణాం త్యాగః సంధ్యాదీనాం విధీయతే ।
ఇదం సంధ్యాత్యాగవిధానం వాచికాభిప్రాయకమ్ ॥ 112

తథా పులస్త్యః ।

శ్లో॥ సూతకే మృతకే చైవ సంధ్యాకర్మ సంత్యజేత్ ।
మనసోచ్చారయే న్మంత్రాన్ ప్రాణాయామ మృతే ద్విజః ॥

– సంధ్యావందనాభావే ప్రత్యయవాయ మాహ –

శ్లో॥ సంధ్యా మిష్టిం చరుం హోమం యావజ్జీవం సమాచరేత్ ।
న త్యేజే త్సూతకే వాపి త్యజన్ గచ్ఛ త్యథో ద్విజః ॥

శ్లో॥ ఆశౌచద్వయమధ్యే తు కథం సంధ్యా విధీయతే ।
సంధ్యా తు మనసా కుర్యా దర్ఘ్యమాత్రం సమన్త్రకమ్ ॥

అత్ర విశేషః ॥

శ్లో॥ సూతకే మృతకే కుర్యా త్ప్రాణాయామ మమంత్రకమ్ ।
తథా మార్జనమంత్రాం శ్చ మన సోచ్చార్య మార్జయేత్ ॥

శ్లో॥ గాయత్రీం సమ్య గుచ్చార్య సూర్యా యార్ఘ్యం నివేదయేత్ ।
ఉపస్థానం నైవకార్యం మార్జనం తు కృతాకృతమ్ ॥ 113

శ్లో॥ సూర్యం ధ్యాయ న్నమస్కుర్యా దేవం సంధ్యా విధీయతే ॥

తా॥ ఆశౌచ మవలంబించినప్పుడు ఆ ఆశౌచము నివృత్తి అగువరకు దానము ఇచ్చుటగాని పుచ్చుకొనుటగాని, వేదాధ్యయనము చేయుటగాని, పితృకర్మలు చేయుటగాని, ఇతరులకు ప్రేతదహన పిండక్రియాదులు జరుపుటగాని, ఔపాసనాది హోమములు చేయుటగాని కూడదు.

అవత్కాలములందు శౌచాది విధులను అవలంబించ నక్కరలేదు. ఆపత్కాలము వెళ్లిన పిమ్మట అనగా శుద్ధ్యనంతరము ఆశౌచవిధులను విధిగా జరుపవలెను. దేశవిప్లవ మందును, రాజబాధాదులయందును, రోగమునందును, జాతాశౌచ మృతాశౌచములందును, సంధ్యా వందనమునకు భంగము కలిగినను దోషము లేదు.

అనగా ఆశౌచాదులయందు సంధ్యావందనము చేయకపోయినను దోషములేదని చెప్పుట. మానసికముగా సంధ్యావందనము చేయవలయునని యభిప్రాయముగాని అసలు సంధ్యావందనము చేయకుండ నుండకూడదు.

ఆ ప్రకారముగా జాతాశౌచమృతాశౌచములయందు సంధ్యావందన కర్మను విడిచిపెట్టకుండ సంధ్యావందనమును మానసికముగా చేయవలయునని యభిప్రాయము.

ఆ ప్రకారము చేయనియెడల ప్రత్యవాయము కలుగును.

ఆశౌచాదులయందు సంధ్యావందనము మాత్రము తను మానసికముగా చేసికొని ఇష్టి మొదలగు చరుహోమములు ఇతరులచే జరిపించుకొనవచ్చును. అట్లు చేయనిచో ఆ బ్రాహ్మణుడు అధోగతిని పొందునని చెప్పబడినది. ఆప్రకారముగానే జాతాశౌచమృతాశౌచముల యందు సంధ్యావందనము మానసికముగా చేసి అర్ఘ్యప్రదానము మాత్రము సమంత్రకముగా చేయవలయునని చెప్పబడినది.

6) అమానసికము ఎట్లనగా - మంత్రము లేకుండ ప్రాణాయామము చేసి, ఆచమన మార్జనాది మంత్రములు మనస్సులో ఉచ్చరించుచు ఆచమనమార్జనలు చేసికొనవలెను. గాయత్రీ మంత్రమును నోట ఉచ్చరించుచు సూర్యునకు అర్ఘ్యమిచ్చి ఉపస్థానము లేకుండ సూర్యునకు నమస్కారము చేయవలెను.

ఇది మానసిక సన్ధ్యావందన మనంబడును.

- ఆశౌచాపవాదనిర్ణయము -

శ్లో॥ ఆశౌచం స్యా ద్గృహస్థానా మన్యేషాం స్నానమాత్రకమ్ ॥

తా॥ గృహస్థాశ్రమము గలవారు మాత్రము ఆశౌచమును అవలంబించవలెను. బ్రహ్మచర్య వానప్రస్థ యత్యాశ్రమముల యందున్నవారు ఆశౌచమును ఆచరించనక్కరలేదు. స్నానము మాత్రము చేయవలెను.

శ్లో॥ పిత్రో రాశౌచ మ స్త్యేవ తత్రాపి బ్రహ్మచారిణః ॥ 118

తా॥ బ్రహ్మచారికి మాత్రము తల్లిదండ్రులు మృతినొందినపుడు ఆశౌచము కలదు. బ్రహ్మచారి అనగా బ్రహ్మచర్య వ్రతము జరుపువాడని యర్థము.

శ్లో॥ గృహిణా మ ప్యుపక్రాన్తే స్నానం యజ్ఞాదికర్మణి ॥ 119

తా॥ గృహస్థులు యజ్ఞ వివాహోపనయన చౌలాదులగు స్మార్తకర్మలన్నియును, మహాదానాదికములును, పౌరాణికములైన దేవతా ప్రతిష్ఠాదులును, ప్రారంభించిన పిదప ఆశౌచము వచ్చెనేని ఆ యాశౌచమును పట్టనక్కరలేదు. కాని విన్న మాత్రమున స్నానమును చేయవలెను. పిమ్మట యథావిధిగా కర్మ పూర్తి చేయవలెను.

శ్లో॥ తండులాదీని ద్రవ్యాణి సువర్ణ వసనాని చ ।
వివాహే దాతృవరయోః కన్యాయా శ్చ న సూతకమ్ ॥120

తా॥ కన్యాదాతకు, అతని భార్యకును, నాందీశ్రాద్ధమైన పిమ్మట ఆశౌచము వచ్చినయెడల కన్యాదానము చేయువరకు ఆశౌచము లేదు. కన్యాదానాంతమందు ఆశౌచము అవలంబించవలెను. వధూవరులకు శేషహోమాంతమువరకు ఆశౌచము లేదు. యజ్ఞాదికర్మలయందు ఋత్విగ్దీక్షితులకు అవభృథాంతమువరకు ఆశౌచము లేదు. పితృకర్మలయందు 'ఆసీమాంతమనువ్రజే' అని ఆసీమాంత ప్రయాణ మని యెడికర్మ పరిసమాప్తివరకు కర్తృభోక్తలకాశౌచము లేదు. అనగా ఈ కార్యాంతములయందు శేషించిన యాశౌచమును పట్టవలయును.

శ్లో॥ తథా కర్మవిపాకాదౌ వ్యాధితస్య న సూతకమ్ ।
ఉత్క్రాన్తిదానే కర్తవ్యే ముమూర్షో శ్చ న సూతకమ్ ॥

తా॥ రోగాదులచే బాధ పొందువానికిని, కర్మవిపాకాది కార్యములు జరుపుకొను వానికిని, ప్రాణావసానమందు పుణ్యలోక ప్రాప్తికొరకు గోదానాదులు జరుపుకొనువానికిని అనన్యగతికములు అనగా అప్పుడు జరిగిననేగాని వీలులేని కార్యములయందును ఆశౌచము లేదని భావము.

శ్లో॥ అసాధారణకృత్యేషు రాజాదే ర్నాస్తి సూతకమ్ ॥ 122

తా॥ రాజు, పురోహితుడు, మంత్రి, వైద్యుడు మొదలగువారికిని, ఇతరులవల్ల అలవికాని కార్యములు చేయవలసిన వారికిని ఆశౌచమున్నను ఆ సమయములందు ఆశౌచముండదు.

శ్లో॥ శిల్పినః కారవో వైద్యా దాసదాసీ శ్చ నాపితాః ।
రాజానః శ్రోత్రియా శ్చైవ సద్యశ్శౌచాః ప్రకీర్తితాః ॥

శ్లో॥ సవ్రత స్సత్రపూత శ్చ ఆహితాగ్ని శ్చ యోద్విజః ।
రాజ్ఞ శ్చ మాతకం నాస్తి యస్యచేచ్ఛతి పార్థివః ॥

శ్లో॥ ఉద్యతో నిధనే దానే ఆర్తో విప్రో నిమంత్రితః ।
తథైవ ఋషిభి ర్దృష్టం యథాకాలేన శుధ్యతి ॥

తా॥ శిల్పులు, రజకుడు, వైద్యుడు, దాసీదాసజనులు, క్షురకులు, రాజులు, శ్రోత్రియులు, వ్రతస్థులు, ఆహితాగ్నులు, రాజుచే నియమింపబడినవారలు, మరణమును పొందబోవుచున్న వారలును, భయగ్రస్తులును అదివరకు ఆశౌచము కలవారైనను వీరితో అవసరము లున్నయెడల ఆ పని తీరునంతవరకు వీరికి ఆశౌచము లేదు.

శ్లో॥ దీక్షితో ఉ ప్యేకపుత్ర శ్చే న్మాతాపిత్రో ర్మృతి ర్యది ।
సంస్కృత్య శాలా మాగత్య యజ్ఞశేషం సమాపయేత్ ॥

తా॥ యజ్ఞమును చేయుచున్న వానితల్లిదండ్రులు యజ్ఞమధ్య మందు మృతులైనయెడల అంతటితో యజ్ఞకర్మను నిలిపి దహనకృత్యములు చేసిన పిమ్మట స్నానాదికృత్యములు చేసి పిమ్మట యజ్ఞశేషమంతయును జరుపవలయును.

శ్లో॥ ప్రారంభో వరణం యజ్ఞే సంకల్పో వ్రతసత్రయోః ।
నాందీముఖే వివాహే చ శ్రాద్ధే పాకపరిక్రియా ॥ 125

తా॥ యజ్ఞమునందు, వరణలు ఇచ్చిన పిమ్మటను, వ్రతసత్రాదుల యందు సంకల్పము చేసిన పిమ్మటను, వివాహమునకు నాందీముఖమైన పిమ్మటను, శ్రాద్ధమునకు పాకప్రోక్షణమైనను, ఆశౌచము కర్తృభోక్తలకు వచ్చినను ఆశౌచమును పట్టకయే కార్యములను పూర్తిచేసికొని పిమ్మట ఆశౌచమును పట్టవలయును.

– ఆశౌచనియమములు –

శ్లో॥ అథ శ్శాయీ బ్రహ్మచారీ ప్రతిగ్రహవివర్జితః ।
దేవాలయప్రవేశం చ తాంబూలం చ వివర్జయేత్ ॥ 126

శ్లో॥ అన్యోన్యం న స్పృశేరం శ్చ సూతక స్యాసమాపనాత్ ।
సపిండో ఉ ప్యసపిండో వే త్యేవం శాస్త్రవినిర్ణయః ॥

శ్లో॥ అసపిండస్పర్శనే తు ప్రాయశ్చిత్త ముదీరయేత్ ॥

తా॥ ఆశౌచము గలదినములయందు బ్రహ్మచర్యాశ్రమ నియమానుసారముగ క్రింద పరుండవలయును. ప్రతిగ్రహమును, దేవాలయ ప్రవేశమును, రాత్రిభోజనమును, తాంబూల చర్వణమును చేయకూడదు. ఆశౌచముగల సపిండుల నైనను, అసపిండుల నైనను, స్పృశింపగూడదు. సపిండులను స్పృశించెనేని సచేల స్నానమును చేయవలెను. అసపిండులను స్పృశించెనేని ప్రాయశ్చిత్తమును చేసికొన వలయును.

- ఆశౌచాన్తమందు చేయదగిన విధి -

శ్లో॥ ఆశౌచాన్తే తు సంప్రాప్తే గోమయాదివిలేపనైః ।
గృహశుద్ధి ర్విధాతవ్యా పుణ్యాహం చైవ వాచయేత్ ॥

శ్లో॥ ఆశౌచే నిర్గతే కుర్యా ద్గృహమార్జన లేపనే ।
సవాసా జల మాప్లుత్య శుద్ధం పుణ్యాహవాచనైః ॥ 128

తా॥ ఆశౌచాంతమందు గృహాదులను గోమయముచే నలికి రంగవల్యాదుల నలంకరించి తటాకాదులయందు సచేల స్నానముచేసి పుణ్యాహవాచనము చేసికొనవలయును.

శ్లో॥ ఆశౌచాన్తే తు కర్తవ్యం బ్రాహ్మణై రభిషేచనమ్ ।
ఋగ్భి ర్యజుర్భి శ్ఛందోగై రబ్లింగైః పావమానకైః ।
ఆశిష శ్చ గృహీ త్వాథ ఉపవీతం చ ధారయేత్ ॥ 129

తా॥ పుణ్యాహవాచనము చేసికొనిన పిమ్మట యజ్ఞోపవీతధారణము చేసి ఋగ్వేదయజుర్వేద మంత్రములచేతను ఆపోహిష్ఠాది పావమాన మంత్రములచేతను అభిషేకమును చేసికొని ఆశీర్వాదములను పొందవలయును.

- ఆశౌచవిషయ స్సమాప్తః -

గురుపాదాభి వన్దనమ్

శ్లో॥ శ్రీవత్సగోత్ర స్సమధీతవేద శ్శ్రీభారతీవంశపయోధిచంద్రః।
రామావధాన్యత్మభవ శ్చకాశే శేషావధా నీతి హి భావపుర్యామ్॥

శ్లో॥ తస్మా దుపాత్తవిద్యో ఽసౌ వేంకటేశ్వరనామకః ।
శర్మా భరద్వాజగోత్రవినీతో ఽవ్వారివంశజః ॥

శ్లో॥ సూను ర్వేంకటభట్టస్య తృతీయః తత్ప్రదానతః ।
తదుక్త మేతత్ సర్వస్వం సర్వేషా ముపకారకమ్ ॥

శ్లో॥ ఆశౌచనిర్ణయం నామ ప్రకాశయతి యన్ముదా ।
అనేన దేవః ప్రీణాతు వేంకటేశః కృపానిధిః ॥

- శాంతిమంగళపఠనము -

శ్లో॥ మంగళం భగవన్! విష్ణో మంగళం మధుసూదన ।
మంగళం పుండరీకాక్ష! మంగళం గరుడధ్వజ ॥

శ్లో॥ నీలాచలనివాసాయ నిత్యాయ పరమాత్మనే ।
శ్రీపద్మాప్రాణనాథాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

- గుణదోషవివేకార్థమ్ -

శ్లో॥ గుణదోషౌ బుధో గృహ్ణ న్నిందుక్ష్వేళా వి వేశ్వరః ।
శిరసా శ్లాఘతే పూర్వం, పరం కంఠే నియచ్ఛతి ॥

శ్రీగురుచరణారవిందార్పణ మస్తు

హరిః ఓం త త్సత్